


షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో శ్రీ రాజరాజేశ్వరీదేవి అవతారంలో అమ్మవారు

# నేత్రపర్వంగా విజయదశమి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విజయదశమి నేత్రపర్వంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శమీ పూజలో ఉమ్మడి జిల్లావాసులు పాల్గొని ఒకరికొక్కరూ దసరా శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. గ్రామాల్లోని ప్రజలు, యువకులు పంట పొలాల్లోకెళ్లి పాలపిట్టను చూశారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన దేవీ శరన్నరాత్రోత్సవాలు ముగిశాయి.



షాద్‌నగర్ పట్టణం, ఆర్టీసీకాలనీలోని శక్తియూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# కేటీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



సబితారెడ్డికి పండుగ శుభాకాంక్షలు చెబుతున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్

విజయదశమిని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారకరామారావుకు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే.. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డికి ప్రజలు, నాయకులు విషెస్ చెప్పారు.
–షాద్‌నగర్ టౌన్/వికారాబాద్ అక్టోబర్ 13



శమీ పూజలో పాల్గొన్న తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



కొకుంట్ల గ్రామంలో దసరా ఉత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి



షాద్‌నగర్‌టౌన్ : షాద్‌నగర్ పట్టణంలో రావణాసురుడి దిష్టిబొమ్మ దహనం

## నేవీ రాడార్‌పై అనుమానాలను నివృత్తి చేయాలి

పరిగి, అక్టోబర్ 13 : నియోజకవర్గంలోని దామగుండం అటవీ ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావిస్తున్న నేవీ రాడార్ కేంద్రంపై ప్రజల్లో ఉన్న అనుమానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివృత్తి చేయాలని టీజేఏసీ వికారాబాద్ జిల్లా చైర్మన్ నాగేశ్వర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాడార్ కేంద్రం ఏర్పాటుతో దామగుండం అడవిలోని ఔషధ మొక్కలు నరికివేతకు గురవుతాయని.. రేడియేషన్‌తో ప్రజలు, అడవి జంతువుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. 1990లో తమిళనాడులోని తిరునల్‌వెల్లిలో ఏర్పాటుచేసిన నేవీ రాడార్ స్టేషన్ చుట్టుపక్కల 50 కిలోమీటర్ల ప్రాంతంలో పర్యావరణ పరిస్థితులు, ప్రజల ఆరోగ్య పరిస్థితులు, ఉత్పరివర్తనాలు వంటి మార్పులపై చేసిన అధ్యయనాల వివరాలు ప్రజల ముందు ఉంచాలని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

## పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని వినతి

కొడంగల్, అక్టోబర్ 13 : పింఛనర్లకు గ్రాట్యుటీ, ఏరియల్స్, జీపీఎఫ్ వంటి వాటితోపాటు ఉపాధ్యాయుల జీపీఎఫ్, ఫైనల్, మెడికల్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని ఆదివారం పట్టణంలోని సీఎం నివాసంలో పింఛనర్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగులతో పాటు ఉద్యోగులు పాపిరెడ్డి, ఆశప్ప, గోపాల్, రాములు, మల్లయ్య, హకీం, బాలరాజు, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాల్లో విషాదం

### రెడ్డిఘణపూర్‌లో ఘటన

బషీరాబాద్, అక్టోబర్ 13 : నవరాత్రి ఉత్సవాల్లో విషాదం చోటుచేసుకున్నది. ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన రెడ్డిఘణపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం..నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆదివారం అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు గ్రామానికి చెందిన యువకులు ఊరేగింపుగా గ్రామ శివారులోని చెరువుకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఆ సమయంలోనే గ్రామానికి చెందిన అశోక్ (38) అనే యువకుడు చెరువులోకి దూకేశాడు. అతడు ఎంతకు పైకి రాకపోవడంతో ఈ విషయాన్ని కుటుంబీకులు, పోలీసులకు సమాచారమందించారు. అనంతరం మల్కన్‌గిరి గ్రామానికి చెందిన గాజ ఈతగాళ్లు చెరువులో గాలింపు చేపట్టగా అశోక్ మృతదేహం లభ్యమైంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఈ ఘటన గ్రామంలో విషాదం నింపింది.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మైలార్‌దేవ్‌పల్లి : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన రవికుమార్ (19) కూలీ. మూడు నెలల కిందట నగరానికి వచ్చి సికింద్రాబాద్‌లో ఉన్న సునీల్ అనే కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. ఆరుగురితో కలిసి మూవర్స్ అండ్ ప్యాకర్స్‌లో పని చేస్తున్నాడు. శాస్త్రీపురంలో ఓ ఇంటి సామగ్రిని షిఫ్ట్ చేయడానికి వచ్చారు. రెండో అంతస్తు నుంచి సామగ్రి షిఫ్ట్ చేసే సమయంలో.. పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు ఇనుప చువ్వ తగిలి.. విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. యజమాని ఉస్మానియా ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు.

# కొడంగల్‌కేనా.. రేవంత్‌రెడ్డి సీఎం?



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

- రూ. వందల కోట్లు ఆ నియోజకవర్గానికేనా..?
- వికారాబాద్ జిల్లా కేంద్రానికి నిధులు కేటాయించరా..?
- నేవీ రాడార్ స్టేషన్‌తో దామగుండం అడవికి ముప్పు
- రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

వికారాబాద్, అక్టోబర్ 13 : కొడంగల్ ప్రాంతానికే ముఖ్యమంత్రి.. రాష్ట్ర ప్రజలకు కాదు అన్నట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ మండిపడ్డారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బసంత్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశతో గెలిపిస్తే.. రేవంత్‌రెడ్డి మాత్రం ప్రజలను నిలువునా ముంచి కొండగల్ అభివృద్ధిపైనే దృష్టి సారించడం సరైంది కాదన్నారు. వికారాబాద్ సెంటిమెంట్ అని మాటలు చెప్పి... జిల్లా కేంద్రానికి ఒక్క రూపాయి విదల్చడం లేద న్నారు. ప్రజలందరూ వ్యతిరేకిస్తున్న నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటును వెంటనే విరమించుకోవాలన్నారు. దానిని ఏర్పాటు చేస్తే దామగుండం అటవీ పూర్తిగా అంతరించిపోవడంతోపాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రేడియేషన్ ప్రభావంతో రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వికారాబాద్ నుంచి హైదరాబాద్, శంకర్‌పల్లి, తాండూరు, మోమిన్‌పేట తదితర రోడ్లు అధ్వానంగా మారాయని.. రేవంత్‌రెడ్డి కొడంగల్ అభివృద్ధికి రూ. వందల కోట్లు ఖర్చు చేయడంతోపాటు వికారాబాద్ జిల్లా కేంద్రాన్ని సైతం పట్టించుకుని అభివృద్ధి చేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామా లు, పట్టణాలు, జిల్లాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాయని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనను చూసి ప్రజ లు విసిగిపోతున్నారన్నారు.

### మన్నెగూడ, అప్పా జంక్షన్ రోడ్డుపై ప్రమాదాలు

మన్నెగూడ, అప్పా జంక్షన్ రోడ్డు మంజూరై ఏండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ పనులు ప్రారంభం కాలేదని.. గత మూడేండ్లలోనే ఆ రోడ్డులో 367 ప్రమాదాలు జరగగా 137 మంది ప్రాణాలు కోల్పోయారని.. 200లకు పైగా క్షతగాత్రులైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికీ ఈ రోడ్డు పనులను ప్రారంభించడంలేదని ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను పక్కన పెట్టడం బాధాకరమన్నారు.

అనంతరం జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే అటవీ ప్రాంతం అంతరించిపోవడంతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అనేక రోగాలు వస్తాయన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విజయ్, సురేశ్‌గౌడ్, రవిశంకర్, చైతన్య కిరణ్, కేదార్నాథ్, సిద్ధిక్ ,శాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## మధుసూదనాచారికి ఘన సన్మానం

శాసన మండలి ప్రతిపక్ష నేతగా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ మధుసూదనాచారిని ఆదివారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పుష్పగుచ్ఛాలను అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుట్టిన రోజు , దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. –షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 13



## ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ కో-కన్వీనర్‌గా ఇబ్రహీం

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మైనారిటీ విభాగం రాష్ట్ర కో–కన్వీనర్‌గా సయ్యద్ ఇబ్రహీంను నియమించినట్లు రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో షాబాద్ గ్రామానికి చెందిన సయ్యద్ ఇబ్రహీంను రాష్ట్ర మైనార్టీ కో–కన్వీనర్‌గా నియమించి నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం సభ్యులు పాల్గొన్నారు. –షాబాద్, అక్టోబర్ 13

## నకిలీ పై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం

- ముగ్గురి అరెస్ట్...
- రూ. 2 లక్షల విలువైన నకిలీ వస్తువులు స్వాధీనం

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): అసలు పేరుతో నకిలీ వస్తువులు విక్రయిస్తున్న దుకాణాలపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి భారీ ఎత్తున వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ సుదీంద్ర కథనం ప్రకారం... రమేశ్‌కుమార్ పరివార్( బేగంబజార్‌లో ఆర్ఎం జనరల్ స్టోర్స్), గోషామహల్‌కు చందిన హితీష్ పవర్ ఫీల్‌ఖానాలో హితీష్ పవర్(శ్రీ సరోజ్ ఏజెన్సీ నిర్వాహకుడు), రాజస్థాన్‌కు చెందిన రమేశ్‌కుమార్ శ్రీ ట్రేడర్స్ పేరుతో ఎర్రగడ్డలో దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ముగ్గురు రాజస్థాన్‌కు చెందిన వాళ్లు కావడంతో.. బేగంబజార్ ప్రాంతంలో జనరల్ ట్రేడింగ్ దుకాణాన్ని నిర్వహించేవారు. అందులో అనుకున్న లాభాలు రాకపోవడంతో అక్రమ దందా చేయాలని నిర్ణయించుకున్నారు. వివిధ కంపెనీల పేరుతో నకిలీ వస్తువులు తయారు చేసి విక్రయించే కాంట్రాక్టులను సంప్రదించారు. గుడ్‌నైట్ లిక్విడ్, కాయిల్స్, గోల్డ్ ఫాష్ కాంబి ప్యాక్, లైజాల్ సర్ఫేస్, క్లీనర్ లిక్విడ్, ఫెవి కిక్ వంటి కంపెనీలకు సంబంధించిన నకిలీ వస్తువులను విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ మూడు దుకాణాలపై దాడులు నిర్వహించి రూ. 2 లక్షల విలువైన నకిలీ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులను అరెస్ట్ చేసి, వారి వద్ద స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ నిమిత్తం బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.

- అడ్వైజరీ నియామకాలతో సరిపెడుతున్న హెచ్ఎండీఏ
- నగరంలో ప్రారంభం కాని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు
- ప్రతిపాదనలకే పరిమితమైన ఎలివేటెడ్ కారిడార్లు, మీరాలం కేబుల్ బ్రిడ్జి

# కన్సల్టెన్సీలతో కాలయాపన

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు తలమానికం కానున్న ఎలివేటెడ్ కారిడార్లు, మీరాలం కేబుల్ బ్రిడ్జిల నిర్మాణంలో హెచ్ఎండీఏ కాలయాపన చేస్తున్నది. ప్రాజెక్టుల ఖర్చు, నిర్మాణ వ్యయం, రెవెన్యూ విషయాలను లోతుగా తెలుసుకునేందుకు అధ్యయనం పేరిట జాప్యం చేస్తున్నది. ట్రాన్సాక్షన్ అడ్వైజర్లను నియమించుకుని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను హెచ్ఎండీఏ ప్రతిపాదనలకే పరిమితం చేస్తున్నది. ఇక సలహాలిచ్చే కన్సల్టెన్సీ నివేదికలు వచ్చేంత వరకు ప్రాజెక్టులను అధికారులు మొదలు పెట్టలేకపోతున్నారు. దీంతో ఆ ప్రాజెక్టులు కార్యరూపంలోకి వచ్చేదెప్పుడనేది ప్రశ్నార్థకంగా మారింది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ నుంచి సుచిత్రా డెయిరీ ఫామ్ రోడ్డు వరకు నిర్మించనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్లతోపాటు మీరాలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి హెచ్ఎండీఏ ఆరు నెలల కిందట ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం రేవంత్‌రెడ్డి ఎలివేటెడ్ కారిడార్లకు శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఇప్పటివరకు ఆ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ముఖ్యంగా ప్రాజెక్టులో కీలకమైన భూసేకరణ ఇప్పటికీ మొదలు కాలేదు. డిఫెన్స్ శాఖ ఇచ్చిన క్లియరెన్స్ మేరకు పరిహారం చెల్లించాల్సి ఉండగా... ఇప్పటికీ పరిహారం, భూముల అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది. అయితే ప్రాజెక్టులపై ఆర్థిక పరమైన అంశాలను అంచనా వేసేందుకు ట్రాన్సాక్షనల్ అడ్వైజర్లను నియమించుకోగా, కన్సల్టెన్సీలు ఇచ్చే నివేదిక ఆధారంగానే హెచ్ఎండీఏ ప్రాజెక్టులను పట్టాలెక్కించనున్నది.



### అడుగు పడేదెన్నడూ?

16 కిలోమీటర్ల మేర రెండు ప్రధాన మార్గాల్లో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల డిజైన్లు ఇప్పటికే ఖరారైనప్పటికీ... కార్యరూపంలోకి తీసుకొచ్చే విషయంలో హెచ్ఎండీఏ తాత్సారం చేస్తున్నది. ప్రధానంగా నిర్మాణ ఖర్చులు, నిర్వహణ భారంపై అవగాహన లేకపోతే ప్రాజెక్టు వ్యయంపై పూర్తి స్పష్టత లేకనే ప్రత్యామ్నాయంగా టీఏలను నియమించుకుంటున్నట్లు తెలుస్తున్నది. ప్యాట్నీ నుంచి తూంకుంట వరకు వెస్ట్ మారేడ్‌పల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట మీదుగా తూంకుంట వరకు ఉండే 11 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను సమగ్రంగా పరిశీలించనున్నది. అదేవిధంగా బెంగళూరు హైవే మార్గాన్ని మరింత విస్తరించేలా ఆరులైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందించింది. బెంగళూరు హైవే నుంచి చింతల్‌మెట్ మీదుగా అత్తాపూర్ వరకు 2.65 కిలోమీటర్ల దూరంలో మీరాలం చెరువుపై కేబుల్ బ్రిడ్జిని నిర్మించనున్నది. ట్రాఫిక్ రద్దీ, రవాణా దూరం తగ్గిపోవడంతోపాటు మీరాలం చెరువును చూసేందుకు వీలు ఉండేలా వ్యూడెక్, స్కై వాక్‌తోపాటు నెహ్రూ జువాలజికల్ పార్క్‌ను చేరుకునేలా డిజైన్ చేశారు. అయితే కొత్తగా చేపట్టిన ఈ ప్రాజెక్టులకు ట్రాన్సాక్షనల్ అడ్వైజర్, ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకే కన్సల్టెన్సీలను హెచ్ఎండీఏ మొదటిసారి నియమించింది. ఆ కన్సల్టెన్సీలు ఇచ్చే ఒకవేళ వయబులిటీ లేదని తెలిసే కొన్ని మార్పులు చేస్తూ ప్రతిపాదనలను ఈ ఏజెన్సీలు అందించనున్నాయి. పీపీపీ విధానంలో నిర్మించనున్న ప్రాజెక్టుల విషయంలో ఈ కన్సల్టెన్సీలు ఇచ్చే నివేదికలు కీలకంగా మారినట్లు హెచ్ఎండీఏ వర్గాలు వెల్లడించాయి.